## వేంకటేశ్వరాలయంలో కుంకుమార్చన

గుమ్మడిదల, జనవరి 4: మండల కేంద్రంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురవారంర భక్తులు కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ వంశపార్యపరంకులు నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు కల్యాణ వేంకటేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదలు అందజేశారు.

## నారాయణ క్యాంపస్‌లో ఫుడ్ పాయిజన్
### 150 మంది విద్యార్థినులకు అస్వస్థత

బొల్లారం, జనవరి 4 : నారాయణ కళాశాల క్యాంపస్‌లో విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన బొల్లారం మున్సిపాలిటీలో ఆలస్యంగా వెలుగు చూసింది. మున్సిపల్ పరిధిలోని నారాయణ గర్ల్స్ కళాశాల క్యాంపస్‌లో 150మంది విద్యార్థినులు రెండు రోజుల క్రితం కలుషిత ఆహారం తీసుకోవడం ద్వారా అస్వస్థతకు గురైనట్లుగా తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. తోటి విద్యార్థులు తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో తమ పిల్లల పరిస్థితిని తెలుసుకొని కళాశాల నుంచి స్వస్థలాలకు తీసుకెళ్లారు. దీంతో అసలు విషయం బయటకు వచ్చింది. కళాశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఫుడ్ పాయిజన్ జరిగిందని విద్యార్థినుల తల్లిదండ్రులు వాపోయారు. కాగా ఈ ఘటనపై కళాశాల ప్రిన్సిపాల్ శిరీషను వివరణ కోరగా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగానే విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని, కళాశాలలో ఎలాంటి ఫుడ్ పాయిజన్ జరగలేదని తెలిపారు.



బొల్లారం మున్సిపల్‌లోని నారాయణ గర్ల్స్ కళాశాల క్యాంపస్

## వాగును పునరుద్ధరించిన అధికారులు

గుమ్మడిదల/జిన్నారం, జనవరి 4: కబ్జాకు గురైనా కొచ్చర్ల వాగును అటవిశాఖ అధికారులు పునరుద్ధరించారు. జిన్నారం మండల కేంద్రంలోని కొచ్చర్ల వాగు ఇటీవల గోయల్ ఇండస్ట్రీ వారు కబ్జా చేసి పైపులు వేయడంతో పంచాయతీ పాలకులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కాగా ఈ విషయంపై స్పందించిన తహసిల్దార్ రవికుమార్ ఫారెస్ట్ అధికారులను ఆదేశించారు. దీంతో వారు గురువారం కొచ్చర్లవాగుకు వేసిన పైపులను జేసీబీతో తొలగించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు తీసుకున్న చర్యలకు అభినందించారు.

## పద్మశాలీ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

సదాశివపేట, జనవరి 4: పద్మశాలీ సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు మునిపల్లి విశ్వనాథం, కార్యదర్శులు నక్క ప్రభాకర్, చిలువేరి వెంకటేశం, చింతా ఆదర్శ్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింతా ఆనంద్‌కుమార్, కమిటీ సభ్యులు మల్లేశం, అంబయ్య, గణేశం, అంబటి విశ్వనాథం, నర్సింహులు, మనోహర్, రవికుమార్, రామకృష్ణ, అంజనేయులు, రుద్రమాణయ్య, శేఖర్, చింతా చంద్రశేఖర్ పాల్గొన్నారు.



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

## మృతుల కుటుంబాలకు పరామర్శ

రాయికోడ్,జనవరి 4 : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ కుటుంబాలను అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పరామర్శించారు. మండల పరిధిలోని మమిడిపల్లి గ్రామానికి చెందిన మాజీద్‌మియా, ధర్మాపూర్‌కు చెందిన మాణెమ్మలు ఇటివల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్ని ఆయన గురువారం మృతుల కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చి అన్ని విధాల ఆదుకుంటామని ధైర్యం చెప్పారు.



ధర్మాపూర్ మాజీ సర్పంచ్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

# దివ్యాంగుల అవస్థలు

- సదరం కోసం ఎదురు చూపులు
- దరఖాస్తులు స్వీకరిస్తేనే మేలు



కోహీర్ : కవేలి మీసేవ కేంద్రం వద్ద బారులుతీరిన దివ్యాంగులు

కోహీర్, జనవరి 4 : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన దివ్యాంగులకు సదరం కోసం అవస్థలు తప్పడం లేదు. నెలలో ఒక్కసారి సదరమ్ క్యాంపు నిర్వహిస్తున్నారు. చెవిటి, మూగ, కంటిచూపు, కుంటి, తదితర సమస్యలు ఉన్న దివ్యాంగులు పింఛన్ కోసం సదరమ్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంది. కానీ మీసే వా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు కేవలం రెండు నుంచి ఐదు నిమిషాల సమయం మాత్రమే కేటాయిస్తున్నారు. వెంటనే వెబ్‌సైట్ ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో మీసేవా నిర్వాహకులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతున్నది. సమస్య మాత్రం అలాగే కొనసాగుతున్నది. తమ పిల్లలకు న్యాయం చేయాలని దివ్యాంగుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**దరఖాస్తులను స్వీకరించాలి**

దివ్యాంగుల నుంచి నేరుగా దరఖాస్తులనుస్వీకరించాలని కోరుతున్నారు. సదరమ్ వెబ్‌సైట్ కేవలం రెండు నుంచి ఐదు నిమిషాలు ఉండడంతో ఒకరిద్దరికి మాత్ర మే అవకాశం కలుగుతున్నది. దీంతో మిగతా వారందరూ నిరాశతో వెనుదిరుగాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది.

మళ్లీ వచ్చేనెల సదరమ్ కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. అయినా మళ్లీ అదే తీరూ.. ప్రతి నెల ఒకరిద్దరికీ మాత్రమే అవకాశం కలుగుతుంది. దివ్యాంగుల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించా లి. లేకపోతే నెలలో ఒక రోజు మొత్తం వెబ్‌సైట్‌ను అం దుబాటులో ఉంచాలి. అప్పుడే తమకు న్యాయం కలుగుతాదని దివ్యాంగులు గురువారం తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సదరమ్ నమోదు విషయంలో తహసీల్దార్ శాంతకుమారిని వివరణ కోరగా ప్రభుత్వాదేశాల మేరకు ఆన్‌లైన్ సేవలు కొనసాగుతున్నాయని, నేరుగా దరఖాస్తులను తీసుకోవాలని ఎవరూ చెప్పలేదన్నారు.

# కొనసాగుతున్న ప్రజాపాలన

సంగారెడ్డి న్యూస్ నెట్‌వర్క్, జనవరి 4: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమం జోరుగా కొనసాగుతుంది. గురువారం ప్రజాపాలన దరఖాస్తులు అధికారులు స్వీకరించారు. దరఖాస్తు ఫారాలు బయట ఎక్కడా కొనవద్దని కార్యదర్శుల వద్ద అందుబాటులో ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. నారాయణఖేడ్ మండల పరిధిలోని బెల్లాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా ప్రభుత్వం ఉంటుందని, ప్రజల ముంగిటికే సంక్షేమ పథకాలు తీసుకువస్తుందన్నారు.



సిర్గాపూర్ : ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



అమీన్‌పూర్ : వందనపురి కాలనీలో పాల్గొన్న తుమ్మల పాండురంగారెడ్డి



హత్నూర : సిరిపురలో ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు



జహీరాబాద్ : బుర్ధిపాడులో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీవో మహేశ్వర్‌రావు



ఝరాసంగం : ప్రజాపాలన దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ సంజీవరావు

## కంగ్టికి 132 కేవీ సబ్ స్టేషన్

కంగ్టి, జనవరి 4 : మండలంలో 132కేవీ సబ్‌స్టేషన్ త్వరలోనే మంజూరు చేస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి అన్నారు. గురువారం కంగ్టిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన విద్యుత్ అధికారుల సమావేశంలో కంగ్టి మండలంలో 132కేవీ సబ్‌స్టేషన్ కోసం ప్రతిపాదనలు పంపాలని స్థానిక అధికారుల ఆదేశించమని పేర్కొన్నారు. దీని కోసం 5ఎకరాల స్థలాన్ని ఎంపిక చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. దీంతో కంగ్టి మండలంలో నెలకొన్న విద్యుత్‌సమస్య పూర్తిగా తొలిగిపోతుందన్నారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటైతే ఈ సబ్‌స్టేషన్ ఎంతో తోడ్పాటుగా ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

## ఇంటింటికీ రాములోరి అక్షింతలు

అందోల్, జనవరి 4: అయోధ్య రామజన్మభూమి తీర్థ క్షేత్రట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరాముడి అక్షింతలను గురువారం అందోల్–జోగిపేట మున్సిపాలిటీలో ప్రజలకు పంపిణీ చేశారు. అక్షింతలకు పట్టణంలో శోభాయాత్ర నిర్వహించి ఇంటింటికీ తిరుగుతూ అందజేయడంతో మహిళలు భక్తిశ్రద్ధలతో అక్షింతలు అందుకున్నారు.



జోగిపేటలో అక్షింతలకు పూజలు చేస్తున్న మహిళ



నల్లవల్లి శివకుమార్‌ను అభినందించి శాలువాతో సన్మానించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

## కేసీఆర్ వీరాభిమానిని అభినందించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

గుమ్మడిదల, జనవరి 4 : రాష్ట్ర తొలిముఖ్యమంత్రి కేసీఆర్ అభిమానిని రాష్ట్రమాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించి శాలువాలతో సన్మానించారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన శివకుమార్ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి వీరాభిమాని. గత నెలలో తొలిముఖ్యమంత్రి ప్రమాదవశాత్తు పడి గాయపడి దవఖానలో చికిత్స పొందగా, త్వరగా కోలుకోవాలని శివకుమార్ నల్లవల్లి గ్రామం నుంచి కొమురవెల్లి వరకు పాదయాత్ర నిర్వహించా డు. శివకుమార్ గురువారం సిద్దిపేటలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును కలువగా అభినందించి శాలువాతో సన్మానించారు. వీరితో పాటు సిద్దిపేట కౌన్సిలర్ రెడ్డివిజేందర్‌రెడ్డి, మెరుగు మాధవ్, రఘు ఉన్నారు.

## 'సోషల్' వదంతులను నమ్మొద్దు

సదాశివపేట, జనవరి 4 : మూడు రోజులుగా తనపై సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు ఆత్మకూర్ నగేశ్ తెలిపారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై ఓ యువతి చేసిన దాడి, సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని ఖండించారు. స్థానికంగా ఉన్న ఒక కుటుంబంతో తనకు ముప్పై ఏండ్లుగా అనుబంధం ఉందన్నారు. ఆ కుటుంబంలోని వివాహిత, భర్తతో కలిసి లండన్‌లో ఉద్యోగం చేస్తున్నదని తెలిపారు. ఇటీవల వివాహిత ఇండియాకు వచ్చిందన్నారు. ఇక్కడే తనకు ఉద్యోగం చూడాలని వివాహిత తన తండ్రితో కలిసి తనను కోరారని తెలిపారు. సదరు వివాహిత ఫోన్ నంబర్ తన ఫోన్‌లో అప్పటికే ఉన్న అమ్మాయి పేరుతో ఉందన్నారు. ఇద్దరి ఫోన్ నెంబర్లు ఒకే పేరుతో ఉన్నాయి. మరో యువతి కూడా యూఎస్‌లో పని చేస్తూ ఇటీవల ఇండియాకి వచ్చిందన్నారు. ఈ క్రమంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా తనతో అనుబంధం ఉన్న కుటుంబానికి చెందిన వివాహితకు క్రిస్మస్ డిన్నర్ పార్టీలో కలుద్దామని మేసేజ్ పెట్టానన్నారు. వివాహితకు పెట్టిన మేసేజ్ అనుకోకుండా మరో అమ్మాయికి వెళ్లిందన్నారు. దీంతో అమ్మాయి తప్పుగా అర్థం చేసుకున్నదని, వెంటనే యువతి ఇంటికి వెళ్లి, తల్లిదండ్రులతో మాట్లాడానని, ఈ క్రమంలో యువతి తనపై దాడి చేసిందన్నారు. ఈ సంఘటన గత డిసెంబర్ 13న జరుగగా, డిసెంబర్ 31నుంచి వాట్సాప్ గ్రూపుల్లో వీడియో వైరల్ అయింది. తనపై వస్తున్న ఆరోపణలను న్యాయపరంగా ఎదుర్కొంటానని, ఇందుకు సిద్ధంగా ఉన్నానని నగేశ్ స్పష్టం చేశారు.